క్లుప్తంగా

భౌతికశాస్త్ర విభాగాధిపతిగా శ్రీనివాస రావు



ఉత్తర్వులు స్వీకరిస్తున్న శ్రీనివాస రావు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య ఎస్.శ్రీనివాస రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యత కలిగిన భౌతిక శాస్త్ర విభాగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతూ, విద్యార్థులను బహుముఖ నైపుణ్యాలను కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దాలని సూచించారు. తనకు విభాగాధిపతిగా నియమించిన అధికారులకు శ్రీనివాస రావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆచార్య డి.బి వెంకటాద్రి నుంచి ఆయన విభాగాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.

వలంటీర్ల పాత్ర కీలకం



వలంటీర్లను సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 23వ వార్డులో వలంటీర్ల సన్మాన కార్యక్రమాన్ని ఆ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అక్కరమాని విజయనిర్మల పాల్గొన్నారు. వలంటీర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వలంటీర్ల సేవ తత్పరులుగా నిలుస్తున్నారన్నారు. నిస్వార్థంగా చేస్తున్న సేవలకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి, ఏపీడీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

12న అప్రెంటిస్ మేళా

పెదగంట్యాడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీసీఎల్, విసూవియస్ ఇండియా లిమిటెడ్, మైలాన్ లాబొరేటరీస్, సినర్జీస్ అండ్ కాస్టింగ్, కనోరియా కెమికల్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, సృజన ఇంజినీరింగ్, జాన్‌బీర్, డొజ్‌కో, వీల్‌మార్ట్ తదితర కంపెనీల ప్రతినిధులు ఈ మేళాకు హాజరు కానున్నారని వివరించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అప్రెంటిస్ రిజిస్టర్ నంబర్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 91773 38977, 83744 30616 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

బీచ్‌రోడ్డు: నగరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరిపిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దర్ని అరెస్టు చేశారు. వారిని న్యూపోర్టు పోలీసులకు అప్పగించగా రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉక్కు కార్మికుల నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన పాటించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 849 రోజులుగా నిరాహార దీక్షలు సాగుతున్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విశాఖ పర్యటన సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిరసన కార్యక్రమాలను ప్రకటించింది. ఇందులో భాగంగా ప్లాంట్‌లోని అన్ని విభాగాలకు చెందిన కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు.

చేతివృత్తులతో ఆర్థిక స్వావలంబన

- దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు తర్ఫీదు



శిక్షణ అనంతరం తయారుచేసిన పటియాలా, గౌనులతో విద్యార్థినులు



టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్

ఆరిలోవ : చేతి వృత్తుల్లో యువతకు శిక్షణ అందించి వారి జీవనోపాధికి తోడ్పడుతోంది దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం నగరంలో ఓ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా శిక్షణ పొందుతున్నారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ వర్సిటీ ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్నారు. యువతకు పలు రకాల చేతి వృత్తుల్లో కొన్నేళ్లుగా శిక్షణ ఇస్తున్నారు. నగరంలో జ్ఞానాపురంలో సెయింట్ జోసెఫ్ కాలేజీ ఫర్ ఉమెన్స్ నూతన విద్యా విధానం (హయ్యర్ ఎడ్యుకేషన్ పాలసీ)లో భాగంగా దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌తో ఈ ఏడాది ఒప్పందం కుదుర్చుకొంది. ఈ ఒప్పందం ప్రకారం మూడేళ్ల వరుసుగా ఆ కళాశాలలో హోం సైన్స్ విద్యార్థినులకు శిక్షణ ఇస్తారు. దీని ప్రకారం ఈ కళాశాలలో బీఎస్సీలో హోం సైన్స్ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా 40 రోజులు నుంచి మూడు నెలలు కాల పరిమితితో వివిధ చేతి వృత్తుల్లో శిక్షణ పొందుతున్నారు. ఇప్పటి వరకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో టెక్స్‌టైల్స్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్‌లో 21 మందికి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం బీఎస్సీ రెండో సంవత్సరం విద్యార్థినులు 26 మందికి డ్రెస్ డిజైనింగ్‌లో రెండో బ్యాచ్ శిక్షణ ఇస్తున్నారు. ఈ బ్యాచ్ శిక్షణ ఈనెల 11తో ముగియనుంది. ప్రస్తుతం జరుగుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థునులకు కుర్తా, పైజమా, టీ-షర్ట్స్, చుడీదార్, పెట్టీకోట్, జాకెట్లు, గౌన్లు, కాటన్ బ్యాగులు తదితర వాటిని తయారు చేయడంలో ఇన్‌స్ట్రక్టర్లు శిక్షణ ఇస్తున్నారు. 40 రోజుల శిక్షణలో థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నారు.



విద్యార్థులు కుట్టిన గౌను



టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

నేడు వస్త్ర ప్రదర్శన..



దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన రెండో బ్యాచ్ శిక్షణ ఈనెల 11తో ముగియనుంది. ఈ సందర్భంగా ఈ శిక్షణలో విద్యార్థినులు తయారు చేసిన వస్తువులను ఆదివారం ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో ప్రదర్శన, విక్రయం జరపనున్నాం. ఆసక్తిగలవారు కొనుగోలు చేసుకోవచ్చు. ఇన్‌స్ట్రక్టర్లు రాధాకుమారి, ఛాయాదేవి, లక్ష్మి, వెంకటరత్నం డ్రెస్ డిజైనింగ్‌లో విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు.

–వి.దక్షిణామూర్తి, ఇన్‌చార్జి, దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్,

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



శిబిరంలో పాల్గొన్న ఏయూ విద్యార్థులు

ఏయూక్యాంపస్: అఖిల భారత స్థాయిలో జాతీయ సేవా పథకం అస్సాం రాష్ట్రంలోని జోర్‌హట్‌లోని కజిరంగా విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ వలంటీర్లు పాల్గొన్నారు. ఏయూ అనుబంధ కళాశాలలకు చెందిన 10 మంది విద్యార్థులు, ప్రోగ్రాం అధికారి ఈ ప్రత్యేక శిబిరంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తూ వీరంతా ఈ శిబిరంలో పాల్గొంటున్నారని ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆచార్య ఎస్.హరనాథ్ తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయం, వస్త్రధారణ ఇతర రాష్ట్రాల విద్యార్థులకు తెలియజేసే విధంగా ఏయూ విద్యార్థులు తమ వస్త్రధారణతో అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో ఏయూ విద్యార్థులు పాల్గొని ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని చాటారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు



దాబాగార్డెన్స్‌లోని ఎంజీఎం హైస్కూల్లో పాఠ్య పుస్తకాలు భద్రపరుస్తున్న ఉపాధ్యాయులు



అల్లిపురం మోడల్ స్కూల్ వద్ద వ్యాను నుంచి పుస్తకాలు దించుతున్న హమాలీలు

- బడుల ప్రారంభం రోజునే పంపిణీకి ఏర్పాట్లు

అల్లిపురం: విద్యా సంవత్సరం (2023–24) ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ బుక్స్ పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే దీనికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ఆయా పాఠశాలలకు శనివారం చేరుకున్నాయి. గడచిన రెండు రోజులుగా నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేపట్టారు. నియోజకవర్గంలోని అల్లిపురం మోడల్ స్కూల్‌తో పాటు, బంగారుమెట్ట ప్రాథమిక పాఠశాల, దాబాగార్డెన్స్‌లోగల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్, అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాల, వైర్లెస్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రకాశరావుపేట ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఆర్బీఎం హైస్కూల్, ఎంవీడీఎం హైస్కూల్, ఎంవీడీ హైస్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, చెంగల్రావుపేట స్కూల్, వసంతబాల ప్రైమరీ స్కూల్స్, రెల్లివీధి స్కూల్, గణేష్ పాఠశాల, ప్రసాద్ గార్డెన్స్, రాజారామ్‌మోహన్‌రాయి ప్రైమరీ స్కూల్ తదితర పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు వీటిని పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

13న స్మృతి దివస్

'సీ' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, సామాజిక కార్యక్రమాల నిర్వహణ



ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ప్రచారం చేస్తున్న సీ, లయన్స్, జేసిస్ ప్రతినిధులు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న స్మృతి దివస్ విజయవంతం చేయాలని సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు కోరారు. ఉక్కు పొట్టి శ్రీరాములు కూడలి వద్ద శనివారం సీ ఆధ్వర్యంలో బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల క్రితం స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్–2లో ఉత్పత్తి ప్రారంభించే ప్రక్రియలో జరిగిన ఆక్సిజన్ ప్లాంట్ ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి సంస్మరణార్థం ఏటా స్మృతి దివస్ పేరిట రక్తదాన శిబిరం, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. లయన్స్ క్లబ్, జేసీఐల సహకారంతో ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీ భవన్‌లో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆ రోజు నాలుగు దివ్యాంగ, అనాథాశ్రమాల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు రక్తదానం చేసి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీ, లయన్స్ క్లబ్, జేసిస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

13న ఇసుకతోట కనకమాంబ అమ్మవారి మహోత్సవం



విద్యుద్దీపాలంకరణలో ఇసుకతోటలో కనకమాంబ అమ్మవారి ఆలయం

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుకతోట గ్రామ ఇలవేల్పు శ్రీ కనకమాంబ అమ్మవారి వార్షిక పండగ మహోత్సవాన్ని ఈనెల 13న నిర్వహించనున్నామని ఆలయ కమిటీ తెలిపింది. ఈమేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామమంతా విద్యుద్దీపాలకరణతో ముస్తాబు చేశారు. ఆదివారం చాటింపు కార్యక్రమంతో మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 12న తొలేళ్ల ఉత్సవం, 13న వార్షిక మహోత్సవం, అనుపు ఉత్సవంగా అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు గొలగాని రాము, అధ్యక్షుడు ఈగల శివ గోవింద్‌లు పేర్కొన్నారు.

ఐసీఐసీఐలో ఉద్యోగాల భర్తీకి 13న ఇంటర్వ్యూలు

గాజువాక : ఐసీఐసీఐలో సీనియర్ ఆఫీసర్, రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకి టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఈనెల 13న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఐఎఫ్‌బీఐ, ఎన్ఐఐటీ అధికారుల సమక్షంలో నిర్వహించనున్న ఈ ఇంటర్వ్యూలకు 2022లో డిగ్రీ పాసైన అభ్యర్థులు, పీజీ ఫైనలియర్ చదువుతున్నవారు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అన్ని తరగతుల్లోను 50 శాతం కనీస మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆన్‌లైన్ టెస్ట్, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

గట్టుపైకి దూసుకుపోయిన కారు



గట్టుపైకి ఎక్కిన కారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ ట్రెలై వీక్లీ మార్కెట్‌లో శనివారం కారు అదుపు తప్పి గట్టుపైకి దూసుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు. వివరాలివి.. శనివారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కారులో మార్కెట్‌కు వెళ్లి, తిరిగి వస్తుండగా మలుపు తిప్పే సమయంలో కారు అదుపు తప్పి గట్టుపైకి దూసుకుపోయింది. కారు స్వల్పంగా దెబ్బ తిన్నప్పటికీ అందులో ఉన్న వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు.

కాలువల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో దుర్గానగర్, రాజేంద్రనగర్, కనకదుర్గానగర్‌లో కాలువలు నిర్మాణం కోసం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నగరంలో అన్ని వార్డులలోను మౌలిక వసతులు కల్పించడంలో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం 12వ వార్డులో సుమారు రూ.20 లక్షలతో కాలువలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ప్రతి వార్డులో జీవీఎంసీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్స్ ఏఈ అప్పాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, బి.సూర్యారావు, పి.ఐ బాలరాజు, హుస్సేన్, వరహాలరావు, అర్జున్, మోహన్, కనకరాజు, సుజాత, రాజులమ్మ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయాల నిర్మాణానికి స్థలాల పరిశీలన



రామవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

ఎంవీపీకాలనీ: గ్రామీణ నియోజకవర్గాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాలకు సంబంధించి పలు చోట్ల హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులు స్థలాలను పరిశీలించారు. భీమిలి నియోజకవర్గంతో పాటు పలు నియోజకవర్గాల్లో శనివారం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్ సూపరింటిండెంట్ ఎస్‌కేసీఎం శర్మ మాట్లాడుతూ గ్రామీణ నియోజకవర్గాల్లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయా గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భీమిలి నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించి స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, హెచ్‌డీపీ సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడుదాం



హాజరైన ప్రజా సంఘాల ప్రతినిధులు



మాట్లాడుతున్న గోపీనాథ్

సీతంపేట: దేశాన్ని మతోన్మాదం నుంచి రక్షించి దేశ సంపదను కాపాడటమే భారత్ బచావో కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని కార్డియాలజిస్ట్, భారత్ బచావో జాతీయ కమిటీ వైస్ చైర్మన్ ఎం.ఎఫ్.గోపీనాథ్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన భారత్ బచావో జిల్లా సదస్సులో ముఖ్య వక్తగా ఆయన ప్రసంగించారు. నేడు హిందూ మతోన్మాదం ప్రమాదకరంగా మారిందని, దానికి కారణం ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలే అన్నారు. హిందూయిజం పేరుతో దేశంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి హింసలకు పాల్పడి అల్లకల్లోలం రేపుతారని నాడే పూలే, అంబేడ్కర్, స్టాలిన్ వంటి మహనీయులు హెచ్చరించారని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్‌కు ప్రధాన శత్రువులు ముస్లింలు, క్రైస్తవులు, వామపక్షాలు, దళితులన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ బీజేపీ అధికారంలోకి వచ్చాక 2014 ముందు.. ఆ తర్వాత దేశ పరిస్థితిని సమీక్షించుకోవలసిన అవసరం ప్రజాస్వామ్య వాదులకు ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ తరుణంలో దేశాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ మోదీ పాలనలో పేదల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందన్నారు. ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటి అమ్మేస్తూ దేశ సంపదను కొద్ది మంది చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గూడూరు సీతామహాలక్ష్మి, చైర్మన్ సి.భాస్కరరావు, ప్రొఫెసర్ సత్యపాల్, కార్యదర్శులు దుడ్డు ప్రభాకర్, జి.వి.రంగారెడ్డి, పొన్నాడ శ్రీనివాస్, ఆర్.వేమన, పౌర, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

దాబాగార్డెన్స్: న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ కార్యదర్శి కె. సురేష్‌కుమార్ కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే జాతీయ మహాసభలు కేరళలో జరిగాయని, తమ సంఘం 1983లో ఆవిర్భవించిందన్నారు. తమ సంఘం నాయకులు పలు సమస్యలపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తాను ఎన్నికైనట్టు చెప్పారు. అంతర్జాతీయ సంఘంలో దేశం నుంచి ఐఏఎల్ మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. పలు కేసుల్లో న్యాయవాదులకు బెదిరింపులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రూ.200 కోట్లు బార్ కౌన్సిల్‌కి కార్పస్ ఫండ్ కింద ఇవ్వాలని కోరారు. సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఐఎం అహ్మద్ మాట్లాడుతూ జడ్జీలతో పాటు న్యాయం కోసం పని చేస్తున్న న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. కొన్ని కేసుల్లో వాదిస్తున్న లాయర్లకు రక్షణ ఉండడం లేదని వాపోయారు. న్యాయవాదుల పరిరక్షణకు చట్టం ఉండాలని కోరారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశ పెట్టాలన్నారు. రాజ్యాంగం ప్రకారం పేదలకు న్యాయం చేయడానికి లాయర్లు కృషి చేస్తున్నారని, లాయర్లు పలు ప్రజా ప్రయోజన పిటిషన్లు దాఖలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎంఎస్ఎస్ భగవతి, రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కుమార్, జాన్సీ, సుబ్బారావు పాల్గొన్నారు.

డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో డీఆర్ఎం పర్యటన



రైల్వే కాలనీవాసుల విద్యుత్ సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో శనివారం డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆకస్మికంగా పర్యటించి, అక్కడి ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ ప్రాంతంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసుల ద్వారా ఆయన తెలుసుకున్నారు. విద్యుత్ కోతలకు గల కారణాలను సిబ్బందిని అడిగి డీఆర్ఎం తెలుసుకున్నారు. మరింత విద్యుత్ సరఫరా అవసరముందని గ్రహించి అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్స్, ఇతర పరికరాలను సమకూర్చుకోవాలని అధికారులకు ఆదేశించారు. మరి కొద్ది రోజుల్లోనే విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యుత్ ఆదాకు అవసరమైన పద్ధతులను కాలనీ వాసులు అవలంబించాలని సూచించారు. పర్యటనలో ఇతర అధికారులు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐక్యత ప్యానెల్ విజయం

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో ఐక్యత ప్యానల్ విజయం సాధించింది. ఎన్నికల్లో జై భీమ్ ప్యానల్ గట్టి పోటీ ఇచ్చింది. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంస్థ ట్రైనింగ్ సెంటర్, హెచ్‌ఆర్‌డీసీలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 162 ఓట్లు ఉండగా 129 ఓట్లు పోలయ్యాయని, ఇందులో చెల్లని ఓట్లు 20గా గుర్తించినట్లు ఎన్నికల అధికారులు కె.పి.మిశ్రా, రాజేంద్రబాబు తెలిపారు. ఎన్నికల ఫలితాలను రాత్రి 7.30 గంటల తర్వాత ప్రకటించారు.

విజేతలు వీరే..

ఐక్యత ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా పోటీ చేసిన జి.కిరణ్‌కు 70 ఓట్లు రాగా జై భీమ్ ప్యానల్ అభ్యర్థి టి.రవికుమార్‌కు 56 ఓట్లు వచ్చాయి ఇందులో చెల్లని ఓట్లు 3 ఉన్నాయి. ప్రధాన కార్యదర్శిగా ఐక్యతా ప్యానల్ అభ్యర్థి కొల్లి దేముడుకు 73 ఓట్లు రాగా, జై భీమ్ అభ్యర్థి జె.రామ చంద్రరావుకు 55 ఓట్లు వచ్చాయి. ఇందులో చెల్లని ఓటు 1 ఉందన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.ఆర్.కె.దాస్, ఉపాధ్యక్షులుగా టి.సాంబశివరావు, కె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా డి.సాయిబాబు, పి.సురేష్, కోశాధికారిగా జి.సంజీవరావు విజయం సాధించారు. ఐక్యతా ప్యానల్‌లో సంయుక్త కార్యదర్శిగా బి.రాజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.